
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 16 డిసెంబరు 2024


ప్రసంగిస్తున్న ఎస్ఎన్ సాహు

కుల గణన అవసరం

- సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు
- ముగిసిన మానవ హక్కుల వేదిక మహాసభలు (7లో..)



కాపలా ఉన్నాం.. అందుకే సాగు చేస్తున్నాం..

అగ్రిగోల్డ్ భూములపై వైసీపీ నాయకుడి వింత వాదన


అగ్రిగోల్డ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

పుట్లూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన ఉన్న అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం రోజుకో ఒక మలుపు తిరుగుతోంది. ఈ భూములను గతంలోనే సీజ్‌చేసిన విషయం తెలిసిందే. ఈ భూముల్లో ఓ వైసీపీ నాయకుడు పంటలు సాగు చేస్తున్న విషయం కూడా పాఠకులకు విదితమే. వీటిని పరిశీలించడానికి వెళ్లిన వామపక్ష నాయకులకు ఆ వైసీపీ నాయకుడు వింత సమాధానం చెప్పాడు. 'మేము కాపలా ఉన్నాం. కాబట్టే మమ్మల్నే ఈ భూములను సాగు చేసుకోమంటున్నారు' అంటూ సమాధానం చెప్పారు. వామపక్ష నాయకులు మాట్లాడుతూ మా కార్యకర్తలు ఇద్దరిని కాపలా పెడతాను. మాకు ఓ 50ఎకరాలు ఇవ్వు వాటిలో సాగు చేసుకుంటాము అనడంతో ఆ వైసీపీ నాయకుడికి నోట మాట రాలేదు. ఇలాగే సాగు కొనసాగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. సీజ్ చేసిన భూములు ఎలా సాగు చేస్తారని ఆగ్రహించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

బాలలకు వాహనాలు ఇవ్వకండి: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలలకు వాహనాలు ఇవ్వరాదని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదివారం ఓ ప్రకటనలో తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మొహమాటానికి పోయి ద్విచక్రవాహనాలు మైనర్లకు ఇస్తున్నారన్నారు. దీని వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్క రోజులో హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, త్రిబుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్‌డ్రైవ్ తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై పోలీసులు 406 కేసులు నమోదు చేశారు. రూ.1,21,910 జరిమానా విధించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. మొబైల్‌కు ఎలాంటి లింకులు వచ్చినా క్లిక్ చేయవద్దని, కాల్ చేసి ఓటీపీలు చెప్పమని అడిగినా ఎవరికీ చెప్పవద్దన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దివాకరరావు


దివాకరరావుకు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారులు

అనంతపురం టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అనంతజిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ కమిటీ ఎంపికైంది. జిల్లాకేంద్రంలోని కృష్ణ కళామందిరం లో ఆదివారం ఈకమిటీకి ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారి వెంకటరాజేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 16పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో 15పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రాడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా దివాకరరావు నియమితులుకాగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్ ఎంపికయ్యారు. అలాగే జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రజాక్‌వలి, జిల్లా ఉపాధ్యక్షులుగా ముక్తియార్ అహ్మద్, మోహన్‌కుమార్, సురేఖారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రసాద్‌జాయింట్ సెక్రెటరీలుగా చాంద్ బాషా, సాహెద్ అక్రం, కరుణాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీపతిరెడ్డి, ఉదయ్‌కిరణ్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీగా తిప్పేస్వామి నియమితులయ్యారు.

● ట్రెజరర్ పోస్టుకు పోటీ

జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్‌లో కీలకమైన ట్రెజరర్ (కోశాధికారి) పోస్టుకు పోటీ నెలకొంది. రాము, పునీత్‌బాబు ఇద్దరు పోటీపడ్డారు. దివాకరరావువర్గం పునీత్‌బాబుకు నచ్చచెప్పినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఈపోటీలలో దివాకరరావు బలపరిచిన రామునే విజయం సాధించారు.

ఆంధ్రుల ఆత్మగౌరవం అమరజీవి

కలెక్టర్ వినోద్‌కుమార్


పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, జేసీ, డీఆర్ఓ తదితరులు

అనంతపురం టౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆత్మగౌరవం అమరజీవి పొట్టిశ్రీరాములు అని, అలాంటి మహనీయుడి స్ఫూర్తితో మనరాష్ట్రం, మన భాష అభివృద్ధికి పాటుపడదామని జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. పొట్టిశ్రీరాములు వర్ధంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి కలెక్టరు, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు ప్రాణ త్యాగం చేసి అమరజీవిగా నిలిచిపోయాడని కొనియాడారు. ఆంధ్రుల కోసం పొట్టిశ్రీరాములు చేసిన ఆత్మార్పణను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. అమరజీవి స్ఫూర్తితో మనమందరం ముందుకు సాగి రాష్ట్రాభివృద్ధికి పాటుపడుదామని కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ సుభాషిణి, డీటీడబ్ల్యుఓ రామాంజనేయులు ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు యుగేశ్వరి, రియాజుద్దీన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నగరపాలిక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్



అనంతపురం క్రైం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరపాలిక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌ను నియమించారు. నగర కమిషనర్ నాగరాజు సోమవారం నుంచి ఫిబ్రవరి 13వరకు రెండు నెలల పాటు సెలవులోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌కు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ డైరెక్టర్ హరినారాయణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కల చెదిరింది..!

గృహ నిర్మాణాన్ని వెంటాడుతున్న వైసీపీ పాపం

"గత ప్రభుత్వ తీరుతో పేదల సొంతింటి కల చెదిరిపోయింది. గతంలో మంజూరై ఎలాంటి నిర్మాణాలకు నోచుకోని ఇళ్లను ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి రద్దు చేస్తోంది. గతంలో 22,803 ఇళ్లను రద్దు చేయగా మళ్లీ 9271 ఇళ్లను రద్దు చేయడానికి ప్రతిపాదనల ను అధికారులు సిద్ధం చేశారు. దీంతో మొత్తం మంజూరు చేసిన 72595 ఇళ్లలో 32,074 ఇళ్లను రద్దు చేసినట్లవుతుంది. ఈ ఇళ్ల రద్దుకు గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని బాధిత వర్గాలు వాపోతున్నాయి."

- ఆంధ్రజ్యోతి, అనంతపురం సిటీ

- గత ప్రభుత్వం శ్రద్ధ చూపక ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు
- గతంలోనే వేల ఇళ్లు రద్దు.. ప్రస్తుతం మరికొన్ని..
- ఆందోళనలో లబ్ధిదారులు




నగర శివారులోని జగనన్న లేఅవుట్

● జిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇలా...

- గత ఐదేళ్లలో మంజూరైన ఇళ్ల సంఖ్య : 72,595
- గతంలో రెండు విడతలుగా రద్దు చేసిన ఇళ్ల సంఖ్య : 22,803
- తాజాగా రద్దు చేసేందుకు ప్రతిపాదనలు పంపిన ఇళ్ల సంఖ్య : 9271
- మొత్తంగా రద్దు చేసే ఇళ్ల సంఖ్య : 32,074
- గత సర్కార్ హయాంలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య : 23,026
- ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తయిన ఇళ్ల సంఖ్య: 6150
- మొత్తంగా పూర్తయిన ఇళ్ల సంఖ్య : 29,176
- వివిధ దశలలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్ల సంఖ్య : 11,345

● తాజాగా తొలగించే ఇళ్ల వివరాలు..

- అనంతపురం అర్బన్	: 4125
- గుంతకల్లు	: 1172
- రాప్తాడు	: 39
- కళ్యాణదుర్గం	: 352
- రాయదుర్గం	: 513
- తాడిపత్రి	: 1699
- ఉరవకొండ	: 1371
మొత్తం ఇళ్ల సంఖ్య	: 9271

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ సర్కార్ పేదోడి ఇళ్ల నిర్మాణాలపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. ఇళ్లు మంజూరు చేయడమే తప్ప.. నిర్మాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. సకాలంలో బిల్లులు చేయకపోవడం, ఇసుక, సిమెంట్, స్టీల్ సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఇళ్లు మంజూరైనా పేదోడు కట్టుకోలేని దుస్థితి కలిగింది. కొన్ని చోట్ల అనువైన ప్రాంతాల్లో ఇంటి పట్టాలివ్వకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఇవ్వడంతో ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం విడతల వారిగా 22,083 ఇళ్లను రద్దు చేసింది. తాజాగా పునాదుల్లోనే నిలబడిపోయిన మరో 9271 ఇళ్లను సైతం రద్దు చేయడానికి ఆశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి తగిన నివేదిక పంపింది.

● వైసీపీ సర్కార్‌లో 22,083 ఇళ్ల తొలగింపు..

● అయోమయంలో లబ్ధిదారులు

స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేయడంతో పేదలు ఎంతో సంబరపడి పోయారు. కానీ ఇచ్చిన హామీల పరంగా వైసీపీ సర్కార్ ఇళ్ల నిర్మాణాలు చేయకపోవడం బాధిత వర్గాలకు శాపంగా మారింది. వీటికితోడు జగనన్న ఇళ్లపై ఇచ్చిన హామీలను అమలు చేయకుండా లబ్ధిదారులదే తప్పు అన్నట్లుగా పట్టాలిచ్చి ఇళ్లను మంజూరు చేసినా, నిర్మాణం చేయలేదనే సాకుతో ఇళ్లను రద్దు చేయడం విమర్శలకు తావిచ్చింది. కాగా మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేయడంతో ఇచ్చిన ఇంటి పట్టాలను కూడా రద్దు చేస్తారా...? అనే సందేహాలు బాధిత వర్గాల్లో నెలకొన్నాయి.


జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

● ప్రభుత్వానికి నివేదిక పంపాం



ఏళ్ల తరబడి నిర్మాణాలు చేయకుండా ఆగిపోయిన 9271 ఇళ్ల నివేదికను ఇటీవల ప్రభుత్వానికి పంపాం. గతంలో కూడా ఇళ్లను రద్దు చేశాం. ఇల్లు నిర్మించకుండా ఉంటే ఇంటి పట్టాను రద్దు చేస్తారో.. లేదో.. రెవెన్యూ వారు చూసుకుంటారు. కావున లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.

-శైలజ, పీడీ, జిల్లా గృహ నిర్మాణ సంస్థ

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి తదితరుల పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆర్‌డబ్ల్యూఎస్ అలసత్వం

జడ్పీకి రూ. 92 కోట్ల బకాయి

వాటర్ యూజర్ చార్జీల వసూళ్లపై నిర్లక్ష్యం

(వివరాలు 7లో...)

బువ్వ పెట్టేవారేరీ..?

గత పాలకవర్గంలో ఇష్టారాజ్యం


కూలిపోయిన భోజనం పంపిణీ చేసే షెడ్

- మార్కెట్ యార్డులో భోజనం బంద్
- ఏడు నెలలుగా నిలిచిపోయిన కార్యక్రమం
- ఇబ్బంది పడుతున్న రైతులు, వ్యాపారులు

అనంతపురంరూరల్, డిసెంబరు 15: గత పాలక వర్గం తీరుతో ఈ ఏడాది వారంతపు పశువుల సంతలో భోజనం బంద్ అయింది. పశువుల సంతలో నిర్వహించే భోజనం కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తులు ఈకార్యక్రమంలో అందినకాటికి దోచుకున్నట్లు ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈక్రమంలో ఈ ఏడాది సంతలో ఉచిత భోజన వసతి కార్యక్రమం నిలిచిపోయింది. ఈ కార్యక్రమం బంద్ చేసి దాదాపు ఏడునెలలు కావొస్తోంది. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.


గతంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ చేస్తున్న మార్కెట్ ఉద్యోగులు, సిబ్బంది

టీడీపీ హయాంలో ప్రారంభం..

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి శని, ఆదివారాల్లో పశువుల సంత జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచి వందల మంది వ్యాపారులు, రైతులు సంతకు వస్తుంటారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రెండు వేల మంది వరకు వస్తున్నట్లు తెలుస్తోంది. సంతకు వచ్చే రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత తెలుగుదేశం పాలనలో అక్కడే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ బాధ్యతలను ఇస్కాన్‌కు అప్పగించారు. అప్పట్లో రూ.ఒక్కొక్కరికి రూ.10 లెక్క ప్రకారం యార్డు నుంచి ఇస్కాన్‌కు చెల్లించేవారు. తరువాత రూ.17లకు పెంచి చెల్లించారు. సంత జరిగే రెండురోజులు 800మందికి భోజనం అందించే వారని తెలుస్తోంది. ఈ ప్రక్రియ గత ప్రభుత్వంలో కూడా ఏడాదికాలంపాటు సవ్యంగా సాగింది. అయితే మార్కెట్ కమిటీ పాలక వర్గం ఏర్పాటైన తరువాత సీన్ పూర్తిగా మారిపోయింది. ఈ కార్యక్రమంపై పాలకవర్గంలోని ఓ సభ్యుడి కన్నుపడింది. దీంతో కార్యక్రమం నుంచి ఇస్కాన్ సంస్థను తప్పించారు. ఆ తరువాత పాలకవర్గం టెండర్ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టారు. 2022-23లో పాలక వర్గానికి చెందిన వారే టెండర్ దక్కించుకు న్నారు. ఒక్కొక్కరికి రూ.20చెల్లించేలా టెండర్ దక్కించుకున్నారు. 2023-24లోను ఇదేవిధంగా టెండర్‌ను పాలకవర్గంలోని కీలక వ్యక్తికి చెందినవారే దక్కించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గత ఏడాది చెల్లించేదానికి కంటే అదనం మరో రూ.7.50 ఎక్కువ కోడ్ చేసి టెండరు దక్కించుకున్నారు. తరువాత వారం వారం.. తక్కువ మందికి భోజనం పెట్టి..ఎక్కువ మందికి పెట్టినట్లు బిల్లులు రాసుకుని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపించాయి. అదనంగా వంద మంది నుంచి 150మందికి పైగా పెట్టినట్లు బిల్లు చేసుకుని అదినకాటికి దండుకున్నట్లు తెలుస్తోంది. టెండర్ దక్కించుకున్న వారు పాలకవర్గ సభ్యులకు సంబంధించిన వారే కావడంతో..అధికారులు నోరు మెదపకుండా బిల్లులు చేసినట్లు ఆయా వర్గాల సమాచారం.

ఇస్కాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగేటప్పుడు నాలుగైదు రకాల వంటలు తీసుకొచ్చి పెట్టేవారు. అన్నం, పప్పు, రసం, పెరుగుతో పాటు అరటి పండు పెట్టేవారు. అయితే పాలక వర్గం తీసుకున్న నిర్ణయంతో వ్యవహారం పూర్తిగా మారిపోయింది. టెండర్ దక్కించుకున్న పాలవర్గ సభ్యులకు సంబంధించిన వ్యక్తులు వడ, పొంగల్, చెట్నీ లేదంటే వెజిటబుల్ రైస్, మజ్జిగ తప్పా మరొక్కటి పెట్టలేదని పలువురు వ్యాపారులు, రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మే వరకు గత పాలక వర్గానికి చెందిన వారికే భోజన కాంట్రాక్ట్ ఉండింది. గడువు ముగిసిన తరువాత టెండర్లు పిలవాల్సి ఉంది. ఆమేరకు ఈ ఏడాది జూన్‌లో సంతలో తాళ్ల విక్రయాలు, టీస్టాల్ ఇతరత్ర వాటికి మార్కెట్ అధికారులు టెండర్లు నిర్వహించారు. అయితే ఇందులో భోజనం పంపిణీ చేసే టెండర్‌ను చేపట్టలేదు. గతంలో టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోనే యార్డు ఉన్నతాధికారులు ఈ ఏడాది ఆ ప్రక్రియకు సంబంధించి టెండర్ నిర్వహణ చేపట్టలేదని సమాచారం.

గత పాలకవర్గం నిర్వాకం.. బంద్ అయిన భోజన పంపిణీ


భోజన సదుపాయం కల్పిస్తే బాగుంటుంది



నేను పశువులు కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటా. ప్రతి వారం సంతకు వస్తా. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనానికి రూ.100నుంచి రూ.150 వరకు ఖర్చు అవుతుంది. గతంలో యార్డులో భోజనం పెట్టేవారు. కొన్ని నెలలుగా పెట్టడం లేదు. తిరిగి భోజన సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

-షమీవుల్లా, వ్యాపారి

హోటళ్లకు వెళ్తున్నాం



తడకలేరు సంత జరిగేటప్పటి నుంచి సంతకు వస్తున్నా. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతలోనే ఉంటా. వ్యాపారం చేస్తుంటా. సంతకు చాలా మంది రైతులు, వ్యాపారుల వస్తుంటారు. స్థానికంగా భోజనం సదుపాయం ఉంటే బాగుండేదీ. గతంలో ఇస్కాన్ టెంపుల్‌లోళ్లు భోజనం పెట్టే వారు. బాగుండేదీ. ఇప్పుడు లేదు. బయట హోటళ్లకు భోజనం కోసం వెళ్తున్నాం.

-పెద్దన్న, ఇప్పేరు, కూడేరు మండలం

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించేలా చర్యలు..



నేను ఇటీవల వచ్చా. సంతలో భోజనం నిర్వాహణకు సంబంధించిన టెండరు ఎందుకు నిర్వహించలేదన్న విషయం నాకు తెలీదు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి తిరిగి ప్రారంభించాలని అనుకుంటున్నాం. ఇంతలోపు కొంత పాలక వర్గం ఏర్పాటైతే..వారి నిర్ణయాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్రక్రియను ప్రారంభించాలన్నా బడ్జెట్ లేదు.

-గోవిందు, ఎంపిక శ్రేణికార్యదర్శి, అనంతపురం మార్కెట్‌యార్డు

కులగణన అవసరం

దీంతోనే సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు.. సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావాలంటే కులగణన అవసరమని సామాజిక విశ్లేషకుడు, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో తొలుత 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎన్ సాహు ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్నవారే అన్నారు. కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందన్నారు. కేరళలో మొట్టమొదటిసారి నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక కులగణన సర్వే చేయించారని గుర్తు చేశారు. ఆ సర్వేలో అన్ని మతాల్లోనూ వివక్ష ఉందని స్పష్టమయిందని తెలిపారు. అంబేద్కర్ వ్యాఖ్యానించినట్లు దేశంలో ఉన్న నిచ్చెనమెట్ల వ్యవస్థలో పైకి పోయేకొద్దీ వివక్ష తగ్గుతుందని, దిగువకొచ్చేసరికి అంత పెరుగుతుందని స్పష్టం చేశారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టు మాలిని సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. బస్తరులో హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి అడవుల్లోని విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తీవ్రవాద ముద్రవేసి అమాయక ఆదివాసీలపై భద్రతా బలగాలద్వారా హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. మందుపాతర పెట్టారన్న నెపంతో ఒక గ్రామంలో 127 మంది ఆదివాసీలను ఎన్ఐఏ అరెస్టు చేసి ఐదేళ్లు జైల్లో పెట్టిందని తెలిపారు. ఆ తర్వాత వారంతా నిర్దోషులుగా బయట పడ్డారని, అంతలోపు ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయని విచారం వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందన్నారు. పాఠ్యాంశాలను మార్చి కాషాయీకరణ చేసే చర్యలు అందులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి రాజేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డాక్టర్ ప్రసూన, ఎస్ఎం బాషా, రసూల్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

22న జాబ్ మేళా

అనంతపురం అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వతేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఎంపీ ఆఫీస్‌లో ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా జాబ్ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అన్ని ట్రేడ్స్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అప్రెంటిషిప్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు చిత్తూరు, తిరుపతిలోని అమరరాజా బ్యాటరీస్ సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 30 సంవత్సరాల వరకు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో రూ.12,500 నుంచి రూ.13,600 వరకు ఇవ్వడంతోపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేలు వేతనం ఇస్తారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు 9000024919, 9000433990 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

రూరల్ క్రికెట్ లీగ్‌లో పరుగుల వర్షం


హుసనారా


చైత్ర


హాన్సిరెడ్డి


హిమవర్షిణి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారిణులు పరుగుల వర్షం కురిపిస్తున్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా... 30 ఓవర్లలో ఏఎస్ఏ 4వికెట్లు మాత్రమే కోల్పోయి 312 పరుగులు చేసింది. ఇందులో హాన్సిరెడ్డి 116, చైత్ర 114 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన టీసీఏ 30 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసి ఓటమి పాలైంది. హిమవర్షిణి (153) ఒంటరి పోరాటం వృథా అయ్యింది. మరో మ్యాచ్‌లో కదిరి, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడగా... కదిరి నిర్ణీత 30ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. బ్యాటర్లు షేక్ హుసనారా 114, చైత్రరెడ్డి 70 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్ఎస్‌బీఎన్ 29.4 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కదిరి 93 పరుగుల తేడాతో విజయం నమోదు చేసింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడగా...టీసీఏ 40 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 239 పరుగులు చేసింది. కౌశిక్ 69, నయీం 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్ఎస్‌బీఎన్ 39.3 ఓవర్లలో 126 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో ఏసీఏ 113 పరుగుల తేడాతో గెలుపొందింది. పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి పర్యవేక్షించారు.

రగ్బీ జట్ల ఎంపిక


ఎంపికైన రగ్బీ బాలబాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ అండర్-15 బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం బత్తలపల్లిలో ఉన్న ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, టోర్నీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఎంపికైన బాలికల జట్టులో...గీతారెడ్డి, హంసిని, లహరి, మాధురి, అనుష్క, నవ్యశ్రీ, రిత్వికశ్రీ, శ్రావ్య, దీపిక ఉన్నారు. బాలుర జట్టులో... మధుకుమార్, వినయ్‌కుమార్, ఇలియాజ్, హేమంత్, యువన్, శివసాయి, జయంత్, మేషక్, ప్రశాంత్, అమర్‌నాథ్, జస్వంత్, ఏకాంత్, తన్విత్‌కుమార్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 16వతేదీ నుంచి పల్నాడు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు.

ఉత్సాహంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు


సందేశమిస్తున్న పాస్టర్ అనిల్ కుమార్, పాల్గొన్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం అరవిందనగర్‌లోని జీసస్ కంపాషన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి వ్యవస్థాపకుడు మోజస్ అనిల్‌కుమార్ ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. అనంతరం పలువురు కోయర్‌లు భక్తిగీతాలాపనలతో అలరించారు. తదనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే దైవజనులందరికీ ప్రేమవిందును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శమంతకమణి, మాజీ మేయర్ స్వరూప, పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

కనీస వేతనం రూ.300

జిల్లాస్థాయిలో వేజ్ మానిటరింగ్ సెల్

నిరంతర తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ




పనిచేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా బోగస్ మస్టర్లకు చెక్ పెట్టి...ఉపాధి కూలీలకు దినసరి కూలీ పెంచేలా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న రూ.263 నుంచి రూ.300కు పెంచడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. బోగస్ మస్టర్లకు చెక్ పెడుతూనే... కూలీల పనివేళల్లో మార్పులు చేసి గిట్టుబాటు వేతనం లభించేలా వేజ్ మానిటరింగ్ విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ విభాగానికి డ్వామాలో కీలకంగా ఉండే జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. కూలీలు ప్రస్తుతం చేస్తున్న 4 గంటల పనిని అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బందితో పాటు ఏపీడీలు, ఏపీఓలు, ఎంపీడీఓలు నిత్యం మస్టర్లను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి చర్యలతో కూలీలకు సగటున రూ.300 వేతనం లభించే వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. దినసరి కూలి రూ.300 పడాలంటే ఏయే పనులు, ఎంత సమయం పనిచేయాల్సి ఉంటుంది అనే అంశాలపై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేజ్ మానిటరింగ్ సెల్ పరిశీలిస్తుంది. ప్రస్తుతం దినసరి కూలి సగటున రూ.263 పడుతోంది. దీనిని రూ.300కు పెంచడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు ప్రారంభించాయి.

జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగం

ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేసి అసలైన కూలీలకు ప్రస్తుతం వస్తున్న వేతనం పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగం (వేజ్ మానిటరింగ్ సెల్) ఏర్పాటు చేసింది. ఉపాధి పనుల్లో ఇప్పటికీ బోగస్ మస్టర్ల బాగోతం నడుస్తోంది. కూలీలు పనులకు రాకపోయినా హాజరైనట్లుగా కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. దీంతో వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందడం లేదు. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పర్యవేక్షణ బాధ్యత జిల్లా విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు.

వేతనం పెంపునకు నిబంధనలు

ఉపాధి కూలీలకు కనీస వేతనం సగటున రూ.300 పెంచేందుకు ప్రభుత్వం పలు నిబంధనలను జారీ చేసింది. ప్రధానంగా పనుల గుర్తింపు, పనిప్రదేశాలకు అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం కూలీలు పని చేయడానికి సానుకూలంగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. టెక్నికల్ అసిస్టెంట్లు నిత్యం మానిటరింగ్ చేయాలి. ఏపీడీ, ఏపీఓ, ఎంపీడీఓలు మస్టర్లను తనిఖీ చేయాలి. కూలీలు చేసే పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. కూలీలకు చెల్లించే వేతనాల రసీదులు కచ్చితంగ ఇవ్వాలి.

కూలి రూ.300 చెల్లించేలా చర్యలు



జాబ్ కార్డుదారులందరికీ దినసరి కూలి రూ.300 అందేలా చూడడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా ఉపాధి కూలీల పనివేళలు పెంచాల్సి ఉంది. రోజుకు 4గంటలు పనిచేసేకూలీలు 5గంటల పాటు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుంది. ఈ విషయాన్ని ప్రతి కూలీ గుర్తించాలి. కూలీలకు దినసరి వేతనం పెంచడంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రస్తుతం దినసరి కూలి రూ.263 పడుతోంది. ఇందుకు అనుగుణంగా అదనంగా మరో రూ.37 కలిపి మొత్తం రోజుకు రూ.300 పడేలా చర్యలు తీసుకుంటున్నాం. -సలీంబాషా, పీడీ, డ్వామా

విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం ముగిశాయి. గ్రూప్ విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు విజేతగా ఆవిర్భవించింది. నంద్యాల ద్వితీయ, తిరుపతి తృతీయస్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ట్రోఫీలు అందించారు. ఎమెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో జంప్‌రోప్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య, కార్యదర్శి సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి నరసింహులు నాయక్ పాల్గొన్నారు.

పేకాటలో పట్టుబడ్డ వైసీపీ సర్పంచ్

ఉరవకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలో పేకాట ఆడుతూ అదే పంచాయతీ వైసీపీ సర్పంచ్ యోగేంద్రరెడ్డి పట్టుబడ్డారు. ఎస్ఐ జనార్దననాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సచివాలయం సమీపంలో పేకాట ఆడుతుండగా 16 మందిని అరెస్ట్‌చేసి, వారి నుంచి 13,700 నగదు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేమని వివరించారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ఇన్‌ఫ్లో 695 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 623 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

సీమ ఉద్యమంలో కవుల పాత్ర కీలకం

మహాకవి సమ్మేళనంలో బొజ్జా దశరథరామిరెడ్డి


కవి డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డికి ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తున్న సాహితీవేత్తలు


అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉద్యమ వికాసంలో కవుల పాత్ర కీలకం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహా కవిసమ్మేళనానికి బొజ్జా దశరథరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కవులు తమ కవితాగానం వినిపించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ... అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో కీలకమైన హంద్రీనీవా కాలువల నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ.. సమైక్యాంధ్ర మత్తులో తరతరాలుగా రాయలసీమ మోసపోతూనే ఉందని, సీమ సాహిత్య రంగంలో మరింత చలనం రావాలని కోరారు. సీనియర్ రచయిత శాంతినారాయణ మాట్లాడుతూ.. సీమ జీవితంలోని సంక్లిష్టతలను కవులు, రచయితలు మరింత పదునుగా రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కవి డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డి తన కవితాగానం వినిపించారు. అనంతరం 'సద్ద కంకి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక అరుణ్, రత్నం, మానవత అమరనాథరెడ్డి, లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లెల నరసింహమూర్తి, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఏలూరు యంగన్న, నబిరసూల్, సడ్లపల్లి చిదంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం నుంచి పడి కూలీ మృతి


రమేష్ (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దుద్దేకుంట సమీపంలో ఐచర్ వాహనంపై నుంచి కిందపడి రమేష్ (24) అనే కూలీ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శివ తెలిపారు. పత్తికొండ వద్ద గొర్రెల ఎరువు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్న వాహనంలో మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామానికి చెందిన రమేష్, ఇతర కూలీలు ఉన్నారు. దుద్దేకుంట గ్రామ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు ఈశ్వరయ్య, ఆదెమ్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటా కిలో రూ. 10



అనంతపురం రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అలసత్వం

జడ్పీకి రూ. 92 కోట్ల బకాయి.. వాటర్ యూజర్ చార్జీల వసూళ్లపై నిర్లక్ష్యం


జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు కోట్ల రూపాయలకు చేరింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మున్సిపాలిటీలు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే సీపీడబ్ల్యూఎస్ (కాంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై) ప్రాజెక్టులకు ప్రతి ఏటా జిల్లా పరిషత్ నుంచి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల నీళ్లు వాడుకున్నందుకు మున్సిపాలిటీల నుంచి జడ్పీకి చెల్లించాల్సిన వాటర్ యూజర్ చార్జీలు సక్రమంగా చెల్లించడం లేదు. వసూలు చేసి జడ్పీకి జమ చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. ఇలా ఏళ్ల తరబడి జరుగుతోంది. ఈ నిర్లక్ష్యం ఇప్పుడు కొండై కూర్చింది. మున్సిపాలిటీ నుంచి వాటర్ యూజర్ చార్జీల కింద రూ. 92 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. అయినా...అదే అలసత్వం కనిస్తోంది.

నిధులు వెళ్లడమే తప్ప.. వచ్చేది లేదు...

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సీపీడబ్ల్యూఎస్ పథకాలు 48 ఉన్నాయి. ఇందులో అనంతపురంలో 33 ఉండగా.. వాటి పరిధిలో 673 గ్రామాలకు, సత్యసాయి జిల్లాలో 15 ఉండగా.. వాటి పరిధిలో 615 గ్రామాలకు నీళ్లు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా శ్రీరామిరెడ్డి, జేసీ నాగిరెడ్డి వంటి మేజర్ ప్రాజెక్టుల ద్వారా గ్రామాలు, మున్సిపాలిటీలకు నీళ్లు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తారు. ప్రతి ఏటా ఆపరేషన్, నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కోసం జిల్లా పరిషత్ నుంచి కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తారు. ప్రాజెక్టుల నిర్వహణకు జడ్పీ నుంచి నిధులను మాత్రం నీళ్ల ప్రాయంగా తీసుకెళ్తున్నారు. ఆ ప్రాజెక్టుల ద్వారా నీళ్లు వాడుకున్నందుకు వాటర్ యూజర్ చార్జీలు చెల్లించడం లేదు. దీంతో ముఖ్యంగా మున్సిపాలిటీల నుంచి కోట్లల్లో బకాయిలు ఉన్నాయి.

రూ. 92.64 కోట్లు పెండింగ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల నుంచి రూ.92.64 కోట్లు జిల్లా పరిషత్‌కు వాటర్ యూజర్ చార్జీలు రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా హిందూపురం మున్సిపాలిటీ నుంచి రూ.38.51 కోట్లు, తాడిపత్రి నుంచి రూ.31.54 కోట్లు, కళ్యాణదుర్గం రూ.15.73 కోట్లు, గుత్తి రూ. 4.47 కోట్లు, మడకశిర నుంచి రూ.2.37 కోట్లు వాటర్ యూజర్ చార్జీలు జడ్పీకి జమ చేయాల్సి ఉంది. కీలక ప్రాజెక్టులకు ఆపరేషన్, నిర్వహణ కోసం జడ్పీ నుంచి నిధులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు తీసుకెళ్తున్నారు. కానీ.. వాటర్ యూజర్ చార్జీలు వసూళ్లు చేసి జడ్పీకి జమ చేయడంలో వారు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు జడ్పీలోని పాలకవర్గ పెద్దలు, అధికారులు సైతం ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఇప్పటి వరకూ పెద్దగా చర్చించలేదు. మున్సిపాలిటీల కమిషనర్లను జడ్పీ అధికారులు పిలిపించి పెండింగ్ బకాయిలపై సమీక్ష చేస్తే...కొంత వరకూ బకాయిలు చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది.

కమిషనర్లతో మాట్లాడతాం



జిల్లా పరిషత్‌కు మున్సిపాలిటీల నుంచి వాటర్ యూజర్ చార్జీలు కోట్ల రూపాయలు జమ కావాల్సి ఉంది. తాడిపత్రి మున్సిపాలిటీ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు జమ అయినట్టు తెలుస్తోంది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూజర్ చార్జీల వసూళ్లకు పాలకవర్గంతో చర్చించి, దగ్గరల్లోనే అన్ని మున్సిపాలిటీల కమిషనర్లకు లెటర్లు పంపుతాం. వారితో కూడా మాట్లాడి పెండింగ్ బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. -వెంకట సుబ్బయ్య, ఇన్‌చార్జ్ సీఈఓ, జిల్లాపరిషత్

సంక్షిప్తం

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదివారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శబరిమలలో ఇరుముడి సమర్పించిన తర్వాత నేరుగా ఆయన తన అనుచరులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విజన్ 2047లో పది సూత్రాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ 20 సంవత్సరాలు ముందుగానే ఆలోచిస్తారన్నారు. అందుకే హైదరబాద్ అంత అభివృద్ధి చెందిందన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం ఇవ్వాలన్న లక్ష్యంతో సీఎం ముందుకు వెళుతున్నారన్నారు.

సభ్యత్వ నమోదుకు విరాళం



విరాళం అందజేస్తున్న పీఎల్ఎన్ మూర్తి

అనంతపురం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో టీడీపీ సానుభూతి పరులైన పేదలకు ఉచితంగా పార్టీ సభ్యత్వం నమోదు చేయించేందుకు వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి రూ.50వేలు విరాళం అందజేశారు. ఆయన ఆదివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు అందజేశారు. అలాగే టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్ రూ. 50వేలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా సభ్యత్వాలు చేయడం కోసమే విరాళం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు చరణ్, నూరుల్లా, అబ్దుల్, గౌస్, షఫీ, స్టీఫెన్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు వితరణ

అనంతపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి లో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల నిర్వాహణకు నగరానికి చెందిన అజయ్‌యాదవ్ అనే వ్యక్తి రూ. 50వేలు వితరణ చేశారు. ఆయన ఆదివారం గ్రామ సర్పంచు శివశంకర్‌కు నగదును అందజేశారు. సర్పంచు మాట్లాడుతూ.. జనవరిలో ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు కౌన్సిల్ సమావేశం

అనంతపురం క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరపాలిక కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. చివరి సమావేశం జూలై 10వ తేదీన జరిగింది. కమిషనర్ దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన నేపథ్యంలో ఈ సారి సమావేశం ఎలా జరగబోతుందనే ఆసక్తి నెలకొంది. నగరపాలికలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు, సీట్ల మార్పు, అభివృ ద్ధి పనులపై ప్రశ్నించడానికి కార్పొరేటర్లు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

పోటీ పరీక్షల మెటీరియల్ వితరణ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద దివ్యాంగ విద్యార్థుల కోసం రూ.70వేలు విలువ చేసే మెటీరియల్‌ను అందజేసి అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి దాతృత్వం చాటుకున్నారు. హెచ్చెల్సీ కాలనీలోని దివ్యాంగుల ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న జిల్లా లోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు మెటీరియల్ కోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. ఆదివారం సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆశ్రమానికి చేరుకుని విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. ఆశ్రమ ఇన్‌చార్జి ఇంద్రారాణి పాల్గొన్నారు.

ఆదాయం రూ.3.94 లక్షలు

అనంతపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3.94 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతతో రూ.2.04 లక్షలు, ఆదివారం ఎద్దుల సంతతో రూ.1.90 లక్షలు వచ్చిందన్నారు.

వాల్మీకి గంగాధర్ మృతి బాధాకరం

● ప్రభుత్వ విప్ కాలవ



నివాళులర్పిస్తున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది వాల్మీకి గంగాధర్ మృతి జాతికి తీరని లోటని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం, వాల్మీకి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మహర్షి వాల్మీకి కల్యాణమండపంలో వాల్మీకి గంగాధర్ సంస్మరణ సభ నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు నాయకులు గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధర్ మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు ఆదినారాయణ, అక్కులప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టలపై ఏపుగా కంపచెట్లు

● బలహీనపడుతున్న కట్టలు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శింగనమల చెరువు కట్ట కనిపించకుండా పెరిగిన కంపచెట్లు

శింగనమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. వాటిని గురించి పట్టించుకొనే వారు లేక ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చెరువుల కట్టలపై కంప చెట్లు, పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగిపోయి, వాటి భద్రత దెబ్బతింటోంది. గత ఐదేళ్లుగా వీటి బాగోగులు గురించి పట్టించుకొనే అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కరువయ్యారు. నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండలంలో 10, శింగనమలలో 13, గార్లదిన్నెలో 18, నార్పలలో 9, పుట్లూరులో 7, యల్లనూరు మండలంలో 12 చొప్పున పెద్ద, చిన్న చెరువులు మొత్తం 69 ఉన్నాయి. వీటి కింద 14, 287 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుల కట్టలపైన ఏపుగా కంపచెట్లు పెరిగిపోవడంతో కట్టలు బలమీనంగా మారుతున్నాయి. ఎలుకలు రంధ్రాలు చేయడంతో కట్టలు దెబ్బతిని కొన్ని చోట్ల గండ్లు పడే అవకాశం ఎక్కువగా ఉందని ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. అయితే కొన్ని చెరువులకు రైతులు శ్రమదానం ద్వారా తాత్కాలిక మరమ్మతులు చేసు కుంటున్నారు. ఏపుగా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో కట్ట ఎక్కడ ఎక్కడ ఉందో కూడా కనిపివచకపోవడం కొసమెరపు.

కూటమి పాలనపై ఆశలు

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో తమ గ్రామాల చెరువులకు మహర్దశ పట్టనుందని రైతులు చిరుఆశలు పెంచుకున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగి, కొత్త కమిటీలు ఏర్పడడంతో చెరువుల అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరు చేసే అవకాశంఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కట్టమీదకు వెళ్లడానికి దారే లేదు



జిల్లా అతిపెద్దదైన శింగనమల చెరువు కట్ట మీద గత ఐదేళ్ల నుంచి ఏపుగా కంపచెట్లు పెరిగాయి. కట్ట మీదకు పోవడానికి దారే లేదు. గతంలో కంపచెట్లు తొలగిస్తే వాహనాలు వెళ్లేవి. అయితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కంపచెట్లు పెరగడంతో కట్ట పూర్తిగా దెబ్బ తిని గడ్లు పడుతున్నాయి. ఇప్పటికైనా కట్ట పెరిగిన కంపచెట్లు తొలగించాలి...

-శ్రీరాములు, రైతు, పోతురాజుకాల్వ


చెరువు వైపు వెళ్లాలంటే భయం



సలకంచెరువు గ్రామ సమీపంలోని చెరువు కట్ట పొడవునా పెద్ద కంపచెట్లు పెరిగాయి. కట్ట కింద వరకు వేర్లు పోవడంతో గతంలో ఒకసారి గండ్లు పడ్డాయి. గత ఐదేళ్లలో ఒకసారి కూడా కంపచెట్లు తొలగించలేదు. చెరువు కట్ట వైపు వెళ్లాలంటే భయం వేస్తుంది. ఇప్పటి కైనా కూటమి ప్రభుత్వం చెరువు కట్టలపై కంపచెట్లు తొలగించాలి.

- బయన్న, రైతు, సలకంచెరువు

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



నియోజకవర్గంలో 69 చెరువుల కట్టల మీద కంపచెట్లు ఏంపుగా పెరిగి, కట్ట కింది వరకు వేర్లు పోయాయి. దీంతో కట్టలు దెబ్బ తింటున్నాయి. గత ప్రజాప్రతి నిధులు ఎనాడూ కంపచెట్లు తొలగించడానికి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రజా పతినిధులు, అధికారులు చొరవ చూపాలి. కంపచెట్లు తొలగించడానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలి.

- ఓ. నల్లప్ప, సీపీఎం నాయకుడు

కంపచెట్లు తొలగించడానికి కృషి చేస్తాం



శింగనమల చెరవు కట్ట మీద కంపచెట్లు విరివిగా పెరిగాయి. గత ఐదేళ్లలో ఏనాడు కట్ట మీద కంపచెట్లు తొలగించ లేదు. కనీసం కట్ట మీదకు మనిషి వెళ్లడానికి కూడా కష్టం గా ఉంది. ఎమ్మెల్యే సమకారంతో చెరువుకట్టపై కంపచెట్లను తొలగించ డానికి కృషి చేస్తాం.

- గార్లదిన్నె సత్యనారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు, శింగనమల చెరువు

బాధ్యతాయుతంగా పనిచేయండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



పేరూరు ప్రాజెక్టు అధ్యక్షుడు, సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతంగా పనిచేసి చెరువుల కింద రైతులు నష్టపోకుండా చూడాలని సాగునీటి సంఘం నూతన సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శనివారం జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఆదివారం వెంకటాపురంలో ఎమ్మెల్యేని కలిశారు. ఎటువంటి గొడవలు లేకుండా ఏకగ్రీవంగా గెలవడంపై హర్షం వ్యక్తం చేసి, నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సా గునీటి సంఘం విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి చెరువుకు నీరందించాలన్నదే లక్ష్యమని, వచ్చిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య వస్తే రాజకీయాలకు తావివ్వకుండా ముందుండి పరిష్కరించాలన్నారు. మండలంలో పెద్ద సాగునీటి సంఘం పేరూరు అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు ఛైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, సభ్యులతో ఆమె ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని దుబ్బార్లపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్లను ఆమె పరిశీలించారు. రూ..55లక్షలతో గ్రామంలో పలు వీధుల్లో సీసీరోడ్లను వేశారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో కనీస వసతులులేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని చూస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లికి చెందిన బోయ నాగన్న, పెద్దకొండాపురానికి చెందిన ఆర్ఎంపీడాక్టర్ వన్నూరప్ప కుటుంబాలను ఎమ్మెల్యే పరిటాలసునీత ఆదివారం సాయంత్రం పరామర్శించారు. రెడ్డివారిపల్లికి చెందిన నాగన్నకు డయాలసిస్ కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. పెద్దకొండాపురానికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్ఎంపీ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్న దుబ్బార్లపల్లిలోని బుర్రావెంకటేశ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్న తరిమెల ఆయకట్టు కమిటీ సభ్యులు

శింగనమల, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సమస్య పరిష్కార దిశగా ముందుకెళుతోందని, సాగునీటి సంఘాల కమిటీలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన తరిమెల ఆయకట్టు కమిటీ అధ్యక్షుడు కుమ్మెత చంద్రాయుడు, ఉపాధ్యక్షుడు దండు లక్ష్మీనారాయణ, సభ్యులు ఆదివారం తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులుతో కలిసి అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గుత్తా ఆదినారాయణ, పెద్దిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, సుధీర్, రామకృష్ణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చెందకండి.. ప్రభుత్వం అండగా ఉంటుంది

గార్లదిన్నె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆందోళన చెందకండనీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భరోసా ఇచ్చారు. గార్లదిన్నె మండలం తలగాసిపల్లి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎల్లుట్ల గ్రామానికి చెందిన కూలీల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాధిత కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే సాయం త్వరగా వచ్చేలా కృషి చేస్తామన్నారు. కొందరు రాజకీయం చేస్తూ బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. అర్హత ఉన్న యువత సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

నార్పల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాలను ఆదివారం జిల్లా మలేరియా అధికారి డీ ఓబుల్ తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతుల గదులు, నివాస గదులను పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ సిబ్బందికి ఆయన సూచించారు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



నగరంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తదితరులు

అమరజీవికి ఘన నివాళి

రామగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): లక్ష్యం కోసం ప్రాణాన్నిత్యాగం చేసిన ఘనుడు అమరజీవి పొట్టిశ్రీరాములు అని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని వెంకటాపురంలో పొట్టిశ్రీరాములు 72వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. టీడీపీ స్థానిక నాయకులతో కలిసి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ... పోరాటం అంటే కత్తులతో చేయాల్సిన అవసరం లేదని శాంతియుతంగా చేసి గెలవచ్చని నిరూపించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. తెలుగు వారంతా ఒక రాష్ట్రంలో ఉండాలని పరితపించారని, దురదృష్టవశాత్తు విడిపోయామ న్నారు. టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్, శ్రీధర్‌నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, చిత్తరంజన్, రామాంజి నేయులు, ఓబుళపతి పాల్గొన్నారు.

●అనంతపురం కల్చరల్: పొట్టిశ్రీరాములు ఆశయాలను కొనసాగిద్దామని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు అన్నారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి మనోజ్, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి టంగుటూరి నాగభూషణ, వాసవీ రక్తనిధి అధ్యక్షుడు జూటూరు మహేష్, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం విద్య : అమరజీవి పొట్టిశ్రీరాములు, సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయులని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. జడ్పీ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు, సర్ధార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతులను నిర్వహించారు. వారి చిత్ర పటాలకు జడ్పీ చైర్‌పర్సన్‌పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అనంతపురం టౌన్: జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టరు సుజాత, ఏఓ గిరిజామనోహరరావు, భాస్కరరెడ్డి, శ్రీనివాసులు, సురేష్, మల్లికార్జున, పవన్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, జాఫర్, హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్, ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: అమరజీవి పొట్టి శ్రీరాముల ఆత్మార్పణంతోనే ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఏర్పడిందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. ఆదివారం జేఎన్‌టీయూలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఎన్ఎస్ఎస్ పీఓలు రామకృష్ణ తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

● గార్లదిన్నె: పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవరణ దినోత్సవం అని ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఎంఈఓ తారా చంద్రానాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఆర్ఈజీఎస్ ఈసీ విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శివానందరెడ్డి, ఆనంద్, షేక్షావలి పాల్గొన్నారు.

● కనగానపల్లి: స్థానిక గ్రంథాలయాధికారి గోవిందు, సర్పంచ్ అంకే పరిమళా రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్ధార్ వల్లబాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



పొట్టిశ్రీరాములు, పటేల్ చిత్రపటాల వద్ద జడ్పీ చైర్‌పర్సన్ నివాళి



పొట్టి శ్రీరాములు వర్ధంతిలో పోలీసుఅధికారులు, సిబ్బంది



నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆలంకరణలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక సమీపంలోని వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు వివిధ పుష్పలతో ప్రత్యేక ఆలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయమంతా సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణతో మార్మోగింది.

భక్తిశ్రద్ధలతో దత్తజయంతి



వలి స్వామి ఆశ్రమంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దత్తజయంతిని ఆదివారం నగరంలోని దత్తమందిరాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతూరులోని దత్తాత్రేయ దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వేదికపై వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ దత్తాత్రేయ వ్రతం నిర్వహించారు. అన్నదాన వినియోగం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ఊరేగించారు. అదేవిధంగా హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమం, రామచంద్రనగర్‌లోని షిర్డిసాయి బాబా ఆలయం, మూడో రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయాల్లోనూ దత్తాత్రేయస్వామిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం దత్తనామకరణం, బ్రహ్మోపదేశం చేశారు. మహామంగళహారతి నివేదన అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వినియోగం చేపట్టారు.

మాజీ సైనికులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): యుద్ధంలో ఎన్నో విశిష్ట సేవలందించిన మాజీ సైనికులకు సన్మానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని మాజీ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు అన్నారు. హెచ్ఎల్సీ కాలనీలోని వీకే భవన్‌లో ఆదివారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో 1965లో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గోవిందరాజులు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, మాజీ సైనికులు సార్జెంట్‌లు మల్లికార్జున రెడ్డి, గోవిందరెడ్డి, హవల్దార్‌లు నరసింహులు, పెద్దన్న, మాజీ సైనికులు నీలిరత్నం, ఖాజామొహిద్దీన్, శ్రీనివాసులు, మొహిద్దీన్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం

● ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో ఆదివారం కుంచెపు వెంకటేష్‌కు పలువురు వడ్డెర్లు, మిత్రులు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. పలు రకాల సమస్యలను అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డే హనుమంతు, రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలకు స్పందన

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలకు మంచి స్పందన లభించింది. స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆదివారం జిల్లా అండర్ -12 బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికిపైగా పాల్గొన్నారు. దీంతో తీవ్రపోటీ నెలకొంది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్ చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, సెలెక్షన్ కమి టీ సభ్యులు కమలాకర్‌నాయుడు, ప్రసాద్, భార్గవ్, జిల్లా కోశాధికారి షబ్బీర్‌అహ్మద్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఎంపికైన ప్రాబబుల్స్ క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించే పోటీలకు హాజరుకావాలని కోరారు.

నడి రోడ్డుపై ఆగిపోయిన బస్సు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురం డిపోకు చెందిన ఏపీ39యూ ఎం4070 నెంబరు గల ఆర్టీసీ పల్లెవెలుగు ఆదివారం సాయంత్రం ఉరవకొండ నుంచి అనంతపురానికి వస్తుండగా జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ ఫ్లైఓవర్‌పై టైర్ పంక్చర్ కావడంతో ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులను వెనుకనే వచ్చిన మరో బస్సులో ఎక్కించి బస్టాండుకు చేర్చారు. బస్సుకు స్టెప్నీ లేకపోవడం వ ల్ల దాదాపు గంటపాటు ఫ్లైఓవర్‌పైనే నిలిపేయాల్సి వచ్చింది. గంట తర్వాత స్టెప్నీ తేవడంతో బస్సును స్టార్ట్ చేసి తీసుకెళ్లారు.

ఘనంగా పడిపూజ



అనంతపురం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం స్వామివారి పడిపూజోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరా ట్‌కు విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శాశ్వత పదునెట్టాంబడిని అలంకరించి గణపతి, లక్ష్మీదేవి సమేత అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులకు పడిపూజను నిర్వహించారు. గురుస్వాములు వాసుదేవన్, రంగాచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు నెట్టెం సూర్యనారాయణ, కార్యదర్శి ఎల్ఐసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

గవిమఠం అభివృద్ధికి తోడ్పాటు అందించండి

● మంత్రి కేశవ్‌కు పీఠాధిపతి విన్నపం


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న పీఠాధిపతి

ఉరవకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న గవి మఠాల అభివృద్ధికి తోడ్పా నందించాలని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి కోరారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో మంత్రిని పీఠాధిపతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గవిమఠం అభివృద్ధికి రూ.2.50కోట్లను సీజీఎఫ్ నిధుల ద్వారా కేటాయించాలని కోరారు. టీటీడీ నిధుల నుంచి హిందూ దేవాలయాలకు నిధులు కేటాయించేలా కృషిచేయాలని విన్నవించారు. అనంతరం మంత్రిని పీఠాధిపతి ఆశీర్వదించి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏజెంట్ రాజన్నగౌడ్, టీడీపీ నాయకులు తిమ్మప్ప, భీమన్న పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలపై రౌండ్‌టేబుల్ సమావేశం

గుంతకల్లుటౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో దేశానికి జమిలి ఎన్నికలు ప్రమాదకరమా-శ్రేయస్కరమా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్ అధ్యక్ష వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, నాయకులు హాజరయ్యారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి దౌల్తాపురం ప్రభాకర్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ మాట్లాడుతూ జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, ఆ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీజేపీ, టీడీపీ నాయకులు హరిహరనాథ్, షేక్ ఫజులు మాట్లాడుతూ.. దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సారి ఎన్నికలు జరుగుతుండడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అందువల్ల ఒకే దేశం ఒకే ఎన్నిక జరిగితేనే మంచిదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్రీనివాసరాజు, వైసీపీ నాయకుడు అబ్దుల్ బాసిద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ గిడ్డంగి అక్రమాలపై కేంద్రమంత్రికి ఫిర్యాదు

గుంతకల్లు/ గుంతకల్లు టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ కంజ్యూమర్ అఫైర్స్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఏపీ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ వనగొంది విజయలక్ష్మి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని హుబ్లీలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని విజయలక్ష్మి కలిసి మాట్లాడారు. పట్టణంలోని ఎఫ్‌సీఐలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటూ విన్నవించారు. ఎఫ్‌సీఐ గిడ్డంగిలో 25 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వచేశారని, 18 నెలల నుంచి ఆ ధాన్యాన్ని వినియోగించనందున నాణ్యత తగ్గుతోందని అన్నారు. రాష్ట్ర ప్రజా పంపిణీకి తగినట్టు ఎఫ్‌సీఐ గోడౌన్ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు గిడ్డంగిని వినియోగిస్తున్నారని అన్నారు. ఈ విషయాలపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్రమంత్రిని కోరినట్టు విజయలక్ష్మి తెలియజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుత్తిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఊబిచేర్ల గ్రామానికి చెందిన ఉమాదేవి (27)అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఉమాదేవి కుటుంబ సమస్యలతో గత బుధవారం ఒంటిపై కార్పెంట్ ఆయిల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే బంధువులు మంటలు ఆర్పి ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జగనన్న కాలనీకి రూ.40 కోట్ల నిధులు

గుంతకల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో గల జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసిందని టీడీపీ నాయకుడు నారాయణ స్వామి తెలిపారు. సీఎం చంద్రబాబు జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతుల కోసం రూ. 40 కోట్లు విడుదల చేయడంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ఎల్పీ నం. 1ని ఎంపికచేశారన్నారు. ఈ లే-అవుట్‌లో దాదాపు 1,400 ప్లాట్లు ఉన్నాయని, ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు జరిగితే మోడల్ కాలనీగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం హౌసింగ్ డీఈ వెంకటేశులుతో కలిసి క్షేత్ర స్థాయిలో లే-అవుట్‌ను పరిశీలించారు. త్వరలో ఈ లే-అవుట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభమౌతాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, కౌన్సిలర్ ప్రభాకర్, సర్పంచు వరలక్ష్మి, నాయకులు ఫజులు, పెంచలపాడు వెంకటేశులు, అంజి, రమేశ్ గౌడ్, వీరేశ్, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

కణేకల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు వేలూరు మరియప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టారు. 122 బూత్‌లో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. టీడీపీ సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.టీడీపీ నాయకుడు షేక్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ చిక్కణ్ణ, తెలుగుయువత నాయకుడు కురుబ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. సీనియర్ నాయకులు మారెప్ప, మల్లికార్జున, చాకలి వెంకటేశులు, సర్మస్, రంగారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గంగిరెడ్డి, ఎర్రిస్వామి, తిమ్మప్ప, శంకర్ తదితరులు ఇంటింటా తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. ఇప్పటికి గ్రామంలో వెయ్యిమంది దాకా టీడీపీ సభ్యత్వం పొందారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కళ్యాణదుర్గం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1995-96వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ 28 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు నాగభూషణ, రవీంద్రబాబు, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకరన్న, హేమాద్రి, నాగరాజు, జీపీ నారాయణను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సాయంత్రం వరకు అందరూ పాఠశాలలో ఆనందంగా గడిపారు.


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నష్టాల బాటలో చీనీ నర్సరీలు

● సాగుచేసే వారు తక్కువ కావడంతో తగ్గిన గిరాకీ
● పెట్టుబడి కూడా రావడం లేదంటున్న నిర్వాహకులు

యల్లనూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకప్పుడు లాభాల బాట పట్టించిన చీనీ నర్సరీలు ప్రస్తుతం దిగాలు పడ్డాయి. కొద్ది కాలంగా చీనీ మొక్కలు కొనేవారు లేకపోవడంతో.. గిరాకీలు లేక ఆయా నర్సరీల నిర్వాహకులు నష్టాలపాలవుతున్నారు. మండలంలో చాలామంది చీనీనర్సరీలను గత 25 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా శింగవరం, కొత్తపల్లి, దంతలపల్లి, గొడ్డుమర్రి, తిరుమలాపురం, పెద్దమల్లేపల్లి, బుక్కాపురం గ్రామాల్లో నర్సరీలను అధికంగా నిర్వహించేవారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులు చీనీ మొక్కలను అధికంగా తీసుకెళ్లేవారు. ఒక్కొక్క మొక్క రూ.60నుంచి రూ. 100లకు కూడా వెచ్చించి మరీ తీసుకెళ్లేవారు. ఒక్కొక్క నర్సరీ నుంచి 10వేల నుంచి 50వేల మొక్కలు కూడా అమ్మకాలు జరిగాయి. అయితే వీటికి నాలుగేళ్ల నుంచి డిమాండ్ తగ్గుతోంది. అప్పట్లో డిమాండ్ బాగా ఉండడంతో.. నిత్యం ఇలానే ఉంటుందని భావించిన నర్సరీ యజమానులు అధికంగా మొక్కలు పెంచారు. అయితే కొద్దికాలంగా గిరాకీలు తగ్గాయి. దీంతో లాభాలు లేక నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క చీనీచెట్లకు తెగుళ్ల బెడద అధికం కావడం, వేరుకుళ్లు వ్యాధి వ్యాపించి చనిపోవడం జరుగుతోంది. దీంతో చీనీమొక్కలు నాటేవారు తక్కువైపోతున్నారు. ప్రస్తుతం ఒక్కొక్క నర్సరీ నుంచి పదివేల మొక్కలు కూడా అమ్మకాలు జరగలేదని నర్సరీ యజమానులు వాపోతున్నారు. నర్సరీలో నాటిన రోజు నుంచి 8నెలల వయసు రాగానే మొక్క అమ్మకానికి సిద్ధంగా ఉంటుంది. అప్పటి నుంచి 6నెలల వ్యవధిలో వాటిని అమ్ముకోవాలి. ఆ తర్వాత నాటినా బతకడం కష్టం. దీంతో మొక్కలు పెద్దగా విక్రయం కాకపోవడంతో చాలా మొక్కలు మిగిలిపోతున్నాయని, దీంతో పెట్టుబడులు కూడా రావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. నష్టాలు చవిచూస్తూ కొందరు నర్సరీలను పెంచడం మానేస్తున్నారు.


యల్లనూరు నర్సరీలో మిగిలిపోయిన చీనీమొక్కలు

మూడు వేల మొక్కలు కూడా అమ్ముడుపోలేదు..



నర్సరీలో గతేడాది 35వేల మొక్కలు పెంచాం. అందులో 3వేల మొక్కలు కూడా అమ్ముడుపోలేదు. ఒక మొక్కకు సుమారు రూ.25 నుంచి రూ.30 వరకు ఖర్చు అయింది. గతంలో ఒక్కొక్క మొక్క 80రూపాయల నుంచి వంద రూపాయల వరకు కూడా అమ్మాము. ప్రస్తుతం ఒక్కొక్క మొక్క రూ.50లకు ఇస్తామన్నా కొనేవారు లేరు.

– చంద్రశేఖర్‌రెడ్డి, నర్సరీ నిర్వాహకుడు, పెద్దమల్లేపల్లి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


గుంతకల్లులో నివాళులర్పిస్తున్న ఆవోపా నాయకులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పట్టణంలోని ఆవోపా నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజంతా సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆవోపా నాయకులు మాట్లాడుతూ.. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. ఆయన కృషితేనే తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు చెన్నకేశవులు, సభ్యులు గోపాజగదీష్, కృపాకర్, మేడా వెంకటేశ్వర్లు, జయంతి వెంకట్, కోటమల్లికార్జున, హరిహరనాథ్, రాజారమణ, రాజేంద్ర, సోమనాథ్‌గుప్తా, దిన్నె హరి, సూర్య రామాంజనేయులు, జయంతి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో సమీపంలో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు కూడా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆసంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాగం శ్రీకాంత్, కిషోర్, సుదర్శన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్యులు ఆదిత్య, పవన్, విశ్వనాథ్, నాగరాజు, రవితేజ, చంద్రశేఖర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఉన్న విలువల బడుల్లో ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు వారు పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్టు వ్యవస్థాపకులు ఎస్కే లెనిన్‌బాబు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, రేవన్న, గురుస్వామి, విలువలబడి కో ఆర్డినేటర్లు రఘువీర, దిలీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలకేంద్రంలోని బాలుర వసతి గృహంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని గాంధీసర్కిల్‌లో ఆర్యవైశ్యులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సురేంద్రనాథ్, సభ్యులు పుల్లయ్య, మద్దిలేటయ్య, అశ్వర్థరంగయ్య, సుబ్రమణ్యం, రాజా, భూమా సుబ్రమణ్యం, హరి, రంగనాయకులు, రంగయ్య, శ్రీకాంత్, రాజశేఖర్, రవి, సత్య తదితరులు పాల్గొన్నారు.


గోవిందవాడ వద్ద రోడ్డుకిరువైపులా ఒరిగిన విద్యుత్ స్తంభాలు

పొంచి ఉన్న ప్రమాదం..

● పలు గ్రామాల్లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
● తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న వైనం
● భయాందోళనలో ప్రజలు ● పట్టించుకోని అధికారులు

బొమ్మనహాళ్, డిసెంబరు 15: మండలంలోని పలు గ్రామాల్లో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని చోట్ల వాలిపోయి నేలకొరిగేందుకు సిద్ధంగా ఉండగా.. మరికొన్ని అడుగు భాగంలో తుప్పుపట్టి విరిగి పడేలా ఉన్నాయి. పొలంగట్లపై, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉండడంతో వాటి నుంచి ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా గోవిందవాడ గ్రామం రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. ఉంతకల్లు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్తంభం అడుగు భాగంలో తుప్పుపట్టి విరిగి పడడానికి సిద్ధంగా ఉంది. కొళగానహళ్లి గ్రామ శివారులో పొలాల గట్లు వద్ద స్తంభా లు వాలిపోయాయి. ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభాలు ఉన్నా.. సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. స్తంభాలు ఒరిగిపోవడంతో కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు సైతం చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. వాటి వల్ల కూడా ప్రమాదం పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు. ట్రాక్టర్లలో పశుగ్రాసాన్ని రవాణా చేసే సమయంలో ఆ తీగలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులైనా స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని వారు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లికి చెందిన బోయ రమేష్ నాలుగు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో.. ఆయన భార్య మల్లేశ్వరి, ఐదుగురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. పేద కుటుంబం కావడంతో పిల్లల్ని పోషించుకోవడానికి మల్లేశ్వరి నిత్యం కూలీ పనులకు వెళుతోంది. వారి దీన స్థితిని తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థికసాయాన్ని అం దించారు. ట్రస్ట్ కార్యదర్శి హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామికి రథం వితరణ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గ్రామోత్సవాన్ని నిర్వహించడానికి గుంతకల్లు పట్టణానికి చెందిన గుండాపార్వతమ్మ కుమారుడు శ్రీనివాసులు, ఆయన సతీమణి అరుణ ఆదివారం ధర్మరథాన్ని ఆలయానికి వితరణ చేశారు. రూ. 2.30లక్షల వ్యయంతో రథాన్ని తయారు చేయించి ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరుశురాముడుకు అందజేశారు. రథానికి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలకు స్వామి దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అండర్‌డ్రైనేజీ ఏర్పాటుకు పలు ప్రాంతాల పరిశీలన

తాడిపత్రి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్‌డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు గన్నెవారిపల్లి గ్రామ పంచాయతీలోని ఐశ్వర్యవిల్లాస్, రాఘవేంద్రనగర్, హరివిల్లు హౌసెస్, అక్కన్నపల్లి, సాయినగర్ తదితర ప్రాంతాలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ ఆదేశాలతో డ్రైనేజీ ఏర్పాటుకు ఇంజనీర్ సహకారంతో కొలతలు వేశామన్నారు. ఆయా కాలనీల వాసులతో చర్చించి డ్రైనేజీకి అందరూ సహకరించాలని కోరామన్నారు. ఆయన వెంటన పలువురు టీడీపీ నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బేల్దారి ఆత్మహత్య

తాడిపత్రి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన వెంకటరమణ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిసిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు మొదటి భార్య లక్ష్మీదేవి మరణించింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత అతను దేవిని రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే కొన్నిరోజుల అనంతరం రెండోభార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది మండలంలోని తలారిచెరువు వద్ద గాలిమర టవర్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కణేకల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇరువురిని అరెస్టు చేశామని, అలాగే వారి వద్ద నుంచి 576 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ పేర్కొన్నారు. కళ్యాణదుర్గంకు చెందిన ఇద్దరు వ్యక్తులు బళ్లారి నుంచి బస్సులో కర్ణాటక మద్యం తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామనానరు. కార్యక్రమంలో కణేకల్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ ఫణీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

బొమ్మనహాళ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులు సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ దాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. విడతల వారీగా నిర్వహిస్తున్నామని, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని ఈఓపీఆర్డీ తెలిపారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి


శ్రీధరఘట్టలో ప్రత్యేకాలకరణలో దత్తాత్రేయస్వామి

బొమ్మనహాళ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో ఆదివారం దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. స్థానిక దత్తాశ్రమంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భం గా వేద పండితులు ఉదయమే స్వామివారికి సుప్రభాతం, పంచామృతాభిషేకం, గురుదత్తా నామకరణ, డోలోత్సవం, ఉపనయనం, గురుదత్తా హో మం, పూర్ణాహుతి, పలకీసేవ నిర్వహిం చి నైవేద్యం సమర్పించి మహామంగళరతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సదర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు చేశారు. పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం


ఆకాశదీపోత్సవాన్ని తీసుకొస్తున్న అర్చకులు

తాడిపత్రి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం ఆకాశదీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మురళీఅయ్యంగార్ తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని ఉంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులోని శ్రీరంగపట్టణంలో గల రంగనాథస్వామి ఆలయంలో జరిగే సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడ కూడా పౌర్ణమి రోజున ఆకాశదీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. దీపోత్సవం తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

కన్నుల పండువగా రథోత్సవం..


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డీ.హీరేహాళ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నీలకంఠేశ్వరస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా మార్గశిర పౌర్ణమిరోజున ఈ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు హోమాలు, రెండోరోజు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆఖరి మూడోరోజు రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు, అర్చనలు చేశారు. అనంతరం సాయంత్రం రథాన్ని గజమాలలతో అలంకరించి స్వామిఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి డప్పు వాయిద్యాల నడుమ, భారీ జన సందోహంతో ఊరేగింపు నిర్వహించారు. ఆంధ్ర నుంచే కాకుండా కర్ణాటక నుంచి సైతం భక్తులు భారీ ఎత్తున తరలివస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

యాడికి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వెంగమనాయుడుకాలనీలో ఆదివారం పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గుత్తిలో చోరీ

గుత్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమేళా వీధిలో నివాసముంటున్న రాజేష్‌కుమార్ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. 5తులాల బంగారు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేష్‌కుమార్ భార్య మేరీతో కలిసి శనివారం పని నిమిత్తం అనంతపురం వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు, బీరువా తాళాలు ధ్వంసమై కనిపించాయి. బీరువాలో చూడగా 5తులాల రెండు బంగారు ఉంగరాలు, ఒక లాంగ్ చైన్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో గల పేకాట స్థావరంపై ఆధివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని, అలాగే వారి నుంచి రూ. 59600 నగదు, 9సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. మరికొందరు పేకాటరాయుళ్లు పారిపోయారని చెప్పారు.

సైకిల్‌పై శబరిమలకు..


సైకిల్‌పై బయలుదేరుతున్న మాలధారులు

యాడికి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన నలుగురు అయ్యప్ప మాలధారులు ఆదివారం సైకిల్‌పై శబరిమలకు బయలుదేరారు. తొలుత వారు స్థానిక దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. శబరిమలకు సుమారు 1000కిలోమీటర్ల దూరం ఉందని, 15రోజుల్లో అక్కడకు చేరుకుంటామని తెలిపారు. బయలుదేరిన వారిలో రంగా, కార్తీక్, అనిల్, కిరణ్ ఉన్నారు.

పుణ్యక్షేత్రంలో పడకేసిన పారిశుధ్యం

● పెన్నహోబిలం ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత
● అసౌకర్యానికి గురవుతున్న భక్తులు

ఉరవకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం పడకేసింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం నిండిపోయింది. ఉత్తరద్వారం సమీపంలో నందీశ్వరుడి మండపం వద్ద చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో నందీశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక దక్షిణ ద్వారం వద్ద కూడా చెత్తకుప్పలు పడి ఉన్నాయి. ఇక సత్రాల వద్ద పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. నిత్యం ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నా.. అధికారులు పారిశుధ్యంపై శ్రద్ధ చూపిన దాఖలాలు లేవు. ఆలయ ప్రాంగణం కూడా కోతుల మలవిసర్జనతో తీవ్ర అపరిశుభ్రతగా ఉంటోంది. దీంతో భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు.


దక్షిణ గోపురం వద్ద పేరుకుపోయిన చెత్త


నందీశ్వరుడి మండపం వద్ద..